# పట్టణాలకు తరలిపోతున్న ప్రజలు

**జనరల్ స్టడీస్**

## పెరుగుతున్న పట్టణ జనాభా దేన్ని సూచిస్తోంది?

'భారతదేశం గ్రామాల్లో నివసిస్తోంది' ఇవి చాలాకాలం కిందట గాంధీజీ అన్న మాటలు. కానీ, పరిస్థితులు మారుతున్నాయి. దేశం పట్టణాల్లో, నగరాల్లో జీవిస్తోందని ఇకపై అనాల్సి వస్తుంది. స్వతంత్ర భారతావని చరిత్రలో తొలిసారిగా గత దశాబ్దంలోనే గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లోనే జనాభా ఎక్కువగా పెరిగింది. ఇలా పెరగడం 1921 తర్వాత ఇదే తొలిసారి. 2011 లెక్కలప్రకారం భారతదేశంలో గ్రామీణ జనాభా 83.31 కోట్లు. ఇది 2001 కంటే 9.06 కోట్లు ఎక్కువ. 2001తో పోలిస్తే 2011లో పట్టణ జనాభా 9.10 కోట్లు పెరిగింది. అంతకు ముందు ఎనిమిది దశాబ్దాల్లో పెరిగిన పట్టణ జనాభా కంటే గ్రామీణ జనాభాయే ఎక్కువగా పెరుగుతూ వచ్చింది. ఇది మనదేశంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, నగరీకరణలకు సూచిక. అయితే ఇదే పెరుగుతున్న గ్రామీణ అశాంతికి నిదర్శనమని ప్రఖ్యాత పాత్రికేయుడు, రామన్ మెగెసెసే అవార్డు గ్రహీత పి.సాయినాథ్ వ్యాఖ్యానించారు.

1991తో పోలిస్తే 2011లో గ్రామీణ జనాభా 11.3 కోట్లు పెరిగింది. ఇదే సమయంలో పట్టణ జనాభా 6.8 కోట్లు పెరిగింది. అయితే 1991 - 2001 మధ్యకాలంలో గ్రామీణ జనాభా పట్టణ జనాభా కంటే 4.5 కోట్లు ఎక్కువగా పెరిగింది. దీనికి భిన్నంగా 2001 - 11 మధ్యకాలంలో గ్రామీణ జనాభా కంటే పట్టణ జనాభా 5 లక్షలు అధికంగా పెరిగింది. ఇది భారీ మార్పు. ఇలాంటి పరిస్థితి 90 సంవత్సరాల కిందట అంటే 1921లో సంభవించింది. అయితే 1921ని మనం ప్రామాణికంగా తీసుకోలేం. ఎందుకంటే, 1918లో వచ్చిన ఫ్లూజ్వరం వల్ల ప్రజలు ఎక్కువ సంఖ్యలో మరణించారు. అత్యధికంగా పెరుగుతున్న పట్టణ జనాభా ధోరణి రాబోయే కాలంలోనూ కొనసాగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరో 30 ఏళ్లలో పట్టణ జనాభా రెట్టింపవుతుందని ఇటీవలే ఐక్యరాజ్య సమితి పేర్కొంది.

2011 లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 121 కోట్లు. ఇందులో గ్రామీణ జనాభా 83.3 కోట్లు కాగా పట్టణ జనాభా 37.7 కోట్లు. అంటే దేశ జనాభాలో గ్రామీణ ప్రాంతాల వాటా 68.84 శాతం. 2001లో దేశ జనాభాలో గ్రామీణ ప్రాంతాల వాటా 72.19 శాతం. 2011లో పట్టణ జనాభా వాటా 31.16 శాతం. అయితే, 2001లో ఇది 27.81 శాతంగా ఉంది. దేశవ్యాప్తంగా జనాభాలో గణనీయమైన తగ్గుదలకు గ్రామీణ ప్రాంతాల్లో భారీగా జనాభా రేటు తగ్గడమే ప్రధాన కారణమని జనాభా లెక్కల రిజిస్ట్రార్ జనరల్ వ్యాఖ్యానించారు. వాస్తవానికి పట్టణ జనాభా పెరుగుదలరేటులో పెద్దగా మార్పు లేదు. అయితే గత దశాబ్దకాలంలో భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో జనాల సంఖ్య 9 కోట్లకు పెరిగింది.

దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ జనాభా విస్తృతిలో గణనీయమైన వ్యత్యాసాలున్నాయి. ఉదాహరణకు, ఉత్తర ప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో గ్రామీణులున్నారు. ఈ రాష్ట్రంలో మొత్తం గ్రామీణ జనాభా 15.5 కోట్లు. ఇది దేశంలోని మొత్తం గ్రామీణ జనాభాలో 18.62 శాతం. ముంబయి నగరంలో అయిదుకోట్ల మంది ఉన్నారు. ఇది దేశంలోనే అత్యధిక పట్టణ జనాభా. దేశంలోని మొత్తం పట్టణ జనాభాలో 13.48 శాతం మంది ఒక్క మహారాష్ట్రలోనే ఉన్నారు.

2001-11 మధ్యకాలంలో గ్రామీణ జనాభాలో పెరుగుదల రేటు 12.18 శాతం. 1991 తర్వాత గ్రామీణ జనాభాలో పెరుగుదల రేటు తగ్గుతూ వస్తోంది. అయితే, వీటిలో వివిధ రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలున్నాయి. ఉదాహరణకు, 2001 - 11 మధ్యకాలంలో కేరళలో గ్రామీణ జనాభా 26 శాతం తగ్గింది. గోవాలో 19, నాగాలాండ్‌లో 15, సిక్కింలో 5 శాతం మేర గ్రామీణ జనాభా తగ్గింది.

గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల సంఖ్య 89 లక్షలు తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో 39 లక్షలు పెరిగింది. దేశంలో స్త్రీ, పురుష నిష్పత్తి ఈ దశాబ్దకాలంలో 933 (2001) నుంచి 940 (2011)కు పెరిగింది. అయితే ఈ పెరుగుదల ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీ, పురుష నిష్పత్తి ఈ కాలంలో 946 నుంచి 947 కు మాత్రమే పెరిగింది. అయితే, పట్టణ ప్రాంతాల్లో స్త్రీ, పురుష నిష్పత్తి ఇదే కాలంలో 900 నుంచి 926 కు పెరిగింది. పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లోనే స్త్రీ, పురుష నిష్పత్తి ఎక్కువగా ఉంది.

పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అక్షరాస్యతలో రెట్టింపు పెరుగుదల నమోదైంది. 2001 లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అక్షరాస్యతా రేటులో తేడా 21.2 శాతంగా ఉంది. 2011 లో ఇది 16.1 శాతానికి తగ్గింది. అయితే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పురుషుల కంటే స్త్రీల అక్షరాస్యత అధికంగా ఉంది. దీనివల్ల 2001-11 మధ్య కాలంలో గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీ, పురుష అక్షరాస్యతలో తేడా 24.6 నుంచి 19.8 శాతానికి తగ్గింది. ఇదే పట్టణ ప్రాంతాల్లో అయితే 13.4 నుంచి 9.8 శాతానికి తగ్గింది.

2001-11 మధ్యకాలంలో దేశ జనాభాలో పెరుగుదల రేటు 17.64 శాతం, అయితే పట్టణ జనాభాలో ఈ పెరుగుదల 31.08 శాతంగా ఉంది. మొత్తం జనాభా పెరుగుదల రేటుతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. ఈ కాలంలోనే జనాభాతోపాటు పట్టణాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2001-11 మధ్యకాలంలో పట్టణాల సంఖ్య 5,161 నుంచి 7,935కు పెరిగింది. ఈ పెరుగుదల 53.7 శాతం. ఈ గణాంకాలు దేశంలో వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణను సూచిస్తున్నాయి. పట్టణీకరణ పెరగడమే ఆర్థికాభివృద్ధిని సూచిస్తోందని సంప్రదాయిక జనాభా శాస్త్రం చెబుతోంది. కానీ, ఈ ధోరణులను మరింత లోతుగా విశ్లేషిస్తున్న నిపుణులు ఇది గ్రామీణ అశాంతిని,



శిథిలమవుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సూచిస్తోందని వాదిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంత జనాభా పెరగడానికి ముఖ్యంగా మూడు కారణాలను జనగణన సూచిస్తోంది. అవి, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు, సహజ పెరుగుదల, కొత్త ప్రాంతాలను పట్టణాలుగా ప్రకటించడం. అయితే గతంలో పట్టణ జనాభా కంటే గ్రామీణ జనాభా ఎక్కువగా పెరిగినప్పుడు కూడా ఇవే కారణాలు వర్తించాయి. అయితే ఈసారి మాత్రమే పట్టణ జనాభా గ్రామీణ జనాభా కంటే కూడా అధికంగా పెరగడానికి బలమైన కారణం ఉందనేది సామాజిక శాస్త్రవేత్తల వాదన. 2001, 2011 జనాభా లెక్కల్లో గ్రామీణ, పట్టణ జనాభా పెరుగుదల్లోని తేడాలను గమనిస్తే ఈ విషయం అర్థమవుతోంది.

### వలసలకు కారణాలనేకం

వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పతనమైన జీవనోపాధే ఈ పరిస్థితికి కారణమని పి.సాయినాథ్ వ్యాఖ్యానిస్తున్నారు. అయితే వలసల ప్రభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి కేవలం జనాభా లెక్కల సమాచారం సరిపోదు. 1991-2001 మధ్యకాలంలో 70 లక్షలమంది వ్యవసాయాన్ని వదిలేశారు. వ్యవసాయాన్ని వదిలేసిన పేద రైతులు పట్టణాలకు వలస పోవాల్సివచ్చింది. పట్టణాల్లో సహజంగా పెరుగుతున్న జనాభా, కొత్తగా పట్టణాల వర్గీకరణ పట్టణ జనాభా పెరుగుదలకు కొంతవరకూ కారణమయినప్పటికీ వ్యవసాయార్థిక వ్యవస్థ దెబ్బతినడమే పట్టణీకరణకు ముఖ్య కారణం. అయితే ఎంతమంది సాగుదార్లు తగ్గారన్న వివరాలు 2011 జనాభా లెక్కల ప్రకారం తెలియాలంటే మరో ఏడాది పట్టవచ్చు. వీరి సంఖ్య 2001కి సమానంగా లేదా ఎక్కువగా ఉండొచ్చు అనేది నిపుణుల అంచనా.

వివిధ రాష్ట్రాల మధ్య పట్టణీకరణలో తేడాను చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. గ్రామీణ, వ్యవసాయ సంక్షోభం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో పట్టణ జనాభా ఎక్కువగా పెరిగింది. ఉదాహరణకు దేశవ్యాప్తంగా చూస్తే పట్టణ జనాభా గత దశాబ్దంలో 31.08 శాతం పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ జనాభా పెరుగుదల రేటు 33.49, కర్ణాటకలో 38.57 శాతంగా ఉంది. గుజరాత్‌లో 42.58, మహారాష్ట్రలో 45.23 శాతం. ఇందులో ఆంధ్రప్రదేశ్,



ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

కర్ణాటక, మహారాష్ట్రలు వ్యవసాయ సంక్షోభాన్ని గతంలో ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం ఎదుర్కొంటున్నాయి.

2001 జనాభా లెక్కలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య పెరుగుతున్న అసమానతలను తెలియజేస్తున్నాయి. అయితే ఈ ధోరణి వల్ల పట్టణాల్లో తీవ్ర సమస్యలు రానున్నాయి. ఇప్పటికే చాలీచాలని పట్టణ మౌలిక వసతులు మరింత ఒత్తిడికి గురయ్యే అవకాశముంది. మంచి నీరు, పారిశుద్ధ్య సేవలు, రహదార్లు, ట్రాఫిక్ యాజమాన్యం, విద్య, వైద్య సేవల అందుబాటు, శాంతిభద్రతలు మొదలైన అనేక సవాళ్లు ఎదురు కానున్నాయి. ఉదాహరణకు, మహానగరాలను కేంద్రంగా చేసుకున్న తీవ్రవాదశక్తుల వల్ల అంతర్గత భద్రతకు ముప్పువాటిల్లుతోంది. అందుకే పట్టణప్రాంత పాలనా సమస్యలపై దృష్టి కేంద్రీకరించాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడిందని ఐక్యరాజ్య సమితి అండర్ సెక్రటరీ జనరల్ జువాన్ క్లోజ్ వ్యాఖ్యానించారు. ఈ అక్టోబరు చివరినాటికి ప్రపంచ జనాభా 700 కోట్లకు చేరనుంది. ఇందులో 50 శాతం జనాభా నగరాలు, పట్టణాల్లోనే నివసిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో భూ సంక్షోభం కూడా పెరగనుందని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. నివాసానికి కావాల్సిన ప్రాథమిక అవసరం భూమి కావడమే దీనికి కారణం. పట్టణాభివృద్ధి ప్రణాళికలను కట్టుదిట్టం చేయడం ద్వారా భవిష్యత్తులో సుస్థిర ప్రాతిపదికపై పట్టణాభివృద్ధిని చేయాలని ఐక్యరాజ్య సమితి సూచించింది. 2001లో దేశ జనాభాలో కేవలం 28 శాతంమంది పట్టణాల్లో ఉంటే, ఇది 2030 నాటికి వీరి సంఖ్య 41 శాతానికి పెరగనుందని కేంద్ర పట్టణ పేదరిక నిర్మూలనాశాఖ కార్యదర్శి కిరణ్‌ఢింగ్రా తెలిపారు. కొన్ని అంచనాల ప్రకారం ఇది 2050 నాటికి 55 శాతానికి కూడా పెరగవచ్చని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధిలో నగరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. దేశ స్థూలదేశీయోత్పత్తిలో 60 శాతం నగరాల నుంచే వస్తోంది. భారత్‌లో మొత్తం మీద చూస్తే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా 1973-74లో 55 శాతం ఉంటే 2004-05లో ఇది 27.5 శాతానికి తగ్గింది. పట్టణాల్లో పేదల సంఖ్య ఇదేకాలంలో 49 శాతం నుంచి 25.7కు తగ్గింది. ఇప్పటికీ దారిద్ర్యరేఖకు దిగువనున్నవారి సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల మురికివాడల సమస్య తీవ్రంగా ఉంటోంది. పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణ సమస్య ఎక్కువగా ఉంది. అభివృద్ధి, సంపదకు మాత్రమే కాకుండా మానవాభివృద్ధికి నిలయాలుగా నగరాలను అభివృద్ధి చేయడంపై భారతదేశ ప్రణాళికలు దృష్టి కేంద్రీకరించాలి. 'పన్నెండో పంచవర్ష ప్రణాళిక పట్టణ సవాళ్లను ఎదుర్కోవడాన్ని లక్ష్యంగా చేసుకుంది' అని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లువాలియా పేర్కొన్నారు. ప్రాథమిక సేవలులేని నగరాలను సృష్టించుకుంటే మురికివాడల విస్ఫోటం జరిగి సామాజిక ఉపద్రవానికి కారణమవుతాయి. పారిశ్రామికీకరణే కాదు ఇటీవల పెరిగిన సేవల రంగం కూడా పట్టణీకరణకు దారితీసింది. పట్టణాల్లో ఉన్న ఆర్థిక, సామాజిక అసమానతలు తగ్గించకపోతే నగర జీవనం సురక్షితంగా ఉండదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### పెరుగుతున్న మురికివాడలు

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు ఇచ్చిన సమాధానంలో పట్టణాల్లోని మురికివాడల పెరుగుదలకు కారణాలను కింది విధంగా పేర్కొంది. ప్రస్తుతం అనుసరిస్తున్న పట్టణాభివృద్ధి ప్రణాళికలు, భూమి వినియోగ విధానంలో లోపాలు, పెరుగుతున్న పట్టణ జనాభా వల్ల భూమి, ఇతర మౌలిక వసతులపై వస్తున్న ఒత్తిడి, పట్టణ పేదల్లో సహజ పెరుగుదల, గ్రామాల నుంచి పట్టణాలకు, చిన్నపట్టణాల నుంచి నగరాలకు వలసలు; చుక్కలంటుతున్న భూమి ధరలు, భూమి అందుబాటు-డిమాండ్‌లో భారీ తేడా, పట్టణ పేదలకు అందుబాటులో ఉండే ధరలకు గృహనిర్మాణ ప్రణాళికలు లేకపోవడం, అల్పాదాయ గృహ నిర్మాణానికి రుణ సదుపాయం లేకపోవడం, పెరుగుతున్న నిర్మాణ వ్యయం మొదలైనవి. ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకుని పట్టణాభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలి. వ్యవసాయ పునరుజ్జీవనం, అనుబంధ రంగాల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా వలసలను నివారించడం ఈ వ్యూహంలో ప్రధానంగా ఉండాలి.

(రచయిత జర్నలిజం అధ్యాపకులు, కాలమిస్టు)